
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 18 డిసెంబరు 2024

నిర్వహణ భారం

ప్రజాపనులకు సొంత డబ్బులు ఖర్చు చేసిన పంచాయతీ కార్యదర్శులు

విడుదల కాని నిధులు

బిల్లుల కోసం ఎదురుచూపు



8

లెక్కలు పక్కాగా ఉండాలి

ఉపాధి పనులకు బిల్లులు

సక్రమంగా లేకుంటే చర్యలు

ఉపాధి హామీ పథకం ప్రిసైడింగ్ అధికారి నరేందర్‌రెడ్డి



7

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి



నియామక పత్రాన్ని అందజేస్తున్న రాపోల్ నర్సింహులు

షాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని తెలంగాణ ప్రజాచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రజా చైతన్య సమితి మండల యూత్ అధ్యక్షునిగా కుమ్మరిగూడ గ్రామానికి చెందిన క్యామ సాయిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి విఠలయ్య, నాయకులు వెంకటయ్య, రాజు, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 48 గంటల మహాధర్నా

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

సొమ్మసిల్లిన కార్మికురాలు, ఆస్పత్రికి తరలింపు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా 48 గంటలు మహాధర్నా చేపట్టారు. సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని గేటు ఎదుట బైఠాయించారు. కలెక్టర్, డీఈవో రావాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా చేపట్టడంతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంకు చెందిన లలిత అనే మధ్యాహ్న భోజన కార్మికురాలు సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెను ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులందరికీ ఈఎస్ఐ పీఎఫ్ రూ.10లక్షల బీమీ సౌకర్యం వసతి కల్పించాలని, కార్మికులకు సబ్సిడీతో కూడిన వంట గ్యాస్‌ను ఆ స్కూలుకు ఎంత అవసరం ఉంటే అంత వంట గ్యాస్‌ను సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, జే.పెంటయ్య, ఎల్లేష్, బచ్చలకూర స్వామి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ అధ్యక్షురాలు అలివేలు, ఉపాధ్యక్షులు గణేష్, పద్మ, నరేందర్ సహాయ కార్యదర్శి శ్రీను, కోశాధికారి సరిత, నాయకులు అలివేలు, లక్ష్మమ్మ, స్వాతి, శిరీష, సావిత్రి, అక్కమ్మ, భాస్కర్, రంగమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉర్సు

పహిల్వాన్‌షావలీ దర్గా వద్ద ఏర్పాట్లు



షాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19 నుంచి షాబాద్ పహిల్వాన్‌షావలీ దర్గా ఉర్సు ప్రారంభమవుతుందని ఉత్సవ మండలి సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన గంధం, 20న దీపారాధన, 21, 22 తేదీల్లో ఉర్సు కొనసాగుతుందని వివరించారు. ఉత్సవాలకు జిల్లాతో పాటు పక్క రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు.



శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్ వద్ద పత్తిలోడుతో వాహనాలు

కొనుగోళ్లకు కొర్రీలు!

పత్తి సాగు చేసిన రైతుకు ప్రతీ సంవత్సరం కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి, శ్రమకు తగ్గ ఫలితం అందటం లేదు. దీనికి తోడు పంట చేతికి వచ్చాక దాని విక్రయానికి పెట్టే నిబంధనలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన ఆంక్షలు గుదిబండగా మారాయి. పత్తి నాణ్యతపై కొర్రీలు పెడుతూ మద్దతు ధరలో కోతలు విధిస్తున్నారు. వర్షాలకు పత్తి రంగు మారిందని, తేమ శాతం అధికంగా ఉందని అధికారులు సాకులు చెబుతూ రైతులను నష్టాల ఊబిలోకి నెడతున్నారు.

నాణ్యతగా లేదని క్వింటాలు ధరలో రూ.70 నుంచి రూ.100 కోత

జోరందుకున్న కాటన్ కొనుగోళ్లు..

నిండిపోయిన జిన్నింగ్ మిల్లులు

జిల్లాలో గతేడాది కంటే రెట్టింపు స్థాయిలో విక్రయాలు

16,928 మంది రైతుల నుంచి 49,800.70 టన్నుల పత్తి సేకరణ

జిల్లాలో సేకరించిన పత్తి వివరాలు (టన్నుల్లో)

	రైతులు	సేకరించిన పత్తి
షాద్‌నగర్	11,083	31,329.96
ఆమనగల్లు	5,268	17,604.15
చేవెళ్ల	577	866.59
మొత్తం	16,928	49,800.70

సీసీఐ కేంద్రాల్లో పత్తి సేకరణకు అధికారుల తిరకాసు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తెల్లబంగారం పోటెత్తుతోంది. కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోళ్లకు ఆటంకం ఏర్పడుతుంది. అయితే తేమశాతం పేరిట అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈసారి జిల్లా వ్యాప్తంగా 1,76,174 ఎకరాల విస్తీర్ణంలో పత్తిపంట సాగు చేశారు. సాగుకు అనుగుణంగా 1.05 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు అంచనా వేశారు.

జిల్లాలో పత్తి సాగు వివరాలు

సంవత్సరం	సాగు (ఎకరాల్లో)
2023	1,27,786
2024	1,76,174

పత్తి సేకరణకు కూలీల కొతర ఉన్నప్పటికీ.. ఇతర జిల్లాల, రాష్ట్రాల నుంచి రప్పించారు. జిల్లాలో 15 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆమనగల్లులో 3, చేవెళ్ల మండలంలో ఓ కొనుగోలు కేంద్రాన్ని

మిగతా 8వ పేజీలో...

తేమ పేరిట ఇబ్బంది



పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొర్రీలు పెడుతుంది. వర్షాల కారణంగా ప్రస్తుతం విక్రయానికి వస్తున్న పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందంటున్నారు. అంతేకాకుండా క్వింటాలు పత్తికి వంద రూపాయలు కోత విధిస్తున్నారు. తేమశాతం నిబంధన లేకుండా పత్తిని కొనుగోలు చేయాలి.

గంగిశెట్టి మురళి, పిట్లలగూడ గ్రామం, నందిగామ మండలం

చలి పంజా

చందనవెల్లిలో 6.8, మోమిన్‌పేటలో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు



కందుకూరులో చలిమంట కాగుతున్న చిన్నారులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో చలి చంపేస్తుంది. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామంలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 8.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం నుంచే మంచు కమ్ముకోవడంతో పొద్దెక్కినా ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఇక రాత్రివేళలో చలికి తట్టుకోలేక స్వెటర్లు, మాస్కులు, మఫ్లర్లు ధరిస్తున్నారు. అంతేకాకుండా చలిమంటలు కాగుతున్నారు. చలి తీవ్రత కారణంగా చిన్నారులు, పెద్దలు జలుబు, శ్వాస సంబంధ సమస్యలతో పాటు జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడ్తాల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం కర్కల్ పహాడ్ విద్యుత్ ఉపకేంద్రంలో బుధవారం మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్ తెలిపారు. దీంతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని కర్కల్‌పహాడ్, గోవిందాయిపల్లి, వాసుదేవ్‌పూర్, రాంనుంతల గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



కంకర తేలిన సంగెం- పోల్కొనిగుట్ట తండా

కంకర తేలి.. ప్రమాదకరంగా మారి

- అధ్వానంగా సంగెం-పోల్కొనిగుట్ట తండా దారి
- నిర్వహణ కొరవడి ధ్వంసమైన మెటల్ రోడ్డు

కేశంపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) సంగెం - పోల్కొనిగుట్ట తండా రోడ్డు అధ్వానంగా తయారైంది. కంకర తేలి ప్రమాదకరంగా మారింది. కనీసం నడవడానికి కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని సంగెం-పోల్కొనిగుట్టతండా మధ్యలో దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇదిపూర్తిగా మట్టి రోడ్డుగా ఉండడంతో పదేళ్ల క్రితం దీనిని మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. చాలా కాలం పాటు రోడ్డు నిర్వహణను పట్టించుకోకపోవడంతో పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ఎక్కువగా రైతులు ప్రయాణిస్తుంటారు. అంతేకాకుండా సిద్దాపూర్, గట్టుపల్లి, మహేశ్వరంతో పాటు హైదరాబాద్ వెళ్లడానికి ఈ దారినే ఉపయోగిస్తారు. అలాగే సంగెం, పోల్కొనిగుట్టతండా గ్రామాల రైతులు తమ ఉత్పత్తులను షాద్‌నగర్, శంషాబాద్, గుడిమల్కాపూర్ మార్కెట్‌లకు తరలించడానికి ఈ మార్గం అనుకూలంగా ఉంటుంది. అంతేకాకుండా దూరభారం తగ్గుతుంది. గిరిజన ప్రాంతాలను కలుపుతూ ఉండే ఈ మార్గాన్ని నాయకులు నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంగెం-పోల్కొనిగుట్ట తండా రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయాలి



సంగెం- పోల్కొనిగూడ తండా రోడ్డును బాగు చేయాలి. ఈ దారి దెబ్బతిని కంకర తేలింది. ఈ మార్గంలోనే మా పొలం ఉంది. పనుల నిమిత్తం ఈ రోడ్డుపై నుంచి వెళ్లడం ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయించాలి.

- కృష్ణయాదవ్, సంగెం గ్రామస్థుడు

కంకర తేలి ఇబ్బంది పడుతున్నాం



పోల్కొనిగుట్ట తండా రోడ్డులో మా పొలం ఉంది. పంటలను ఇంటికి తీసుకు రావడానికి ఇబ్బంది పడుతున్నాం. బైక్‌పై వెళ్తుంటే కంకర రాళ్లు తగిలి కిందపడే పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డును బీటీగా మార్చాలి.

కుమ్మరి శ్రీనివాస్, సంగెం

నూతన ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి



డీటీవోకు వినతి పత్రం అందిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నేతలు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ నేతలు డీటీవోకు వినతి చేశారు. రెండు నెలల నుంచి జీతాలు రావడం లేదని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, కిషన్ చౌహాన్, శంకర్ నాయక్, రాములయ్య, జబీర్ అజాద్, కృష్ణ, పబ్బతి, ఆంజనేయులు ఉన్నారు.

మంగలిగడ్డ తండాలో నేల పరీక్షలు

యాచారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుర్మిద్ద గ్రామపంచాయతీ పరిధిలోని మంగలిగడ్డతండాలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో మంగళవారం టీఎస్ఐఐసీ అధికారులు నేలపరీక్ష చేశారు. మా అనుమతి లేకుండా నేలపరీక్షలు ఎలా చేస్తారని కొందరు గిరిజన రైతులు అధికారులను అడ్డుకున్నారు. ఆందోళనకు దిగారు. అయినా పట్టించుకోకుండా అధికారులు నేల పరీక్ష కొనసాగించారు. ఇక్కడ ఫార్మాసిటీ కంపెనీలు ఏర్పాటు చేయమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి ఫార్మాసిటీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు.

వచ్చే నెల 4,5 తేదీల్లో ‘ఇస్లామిక్ కాంగ్రిగేషన్’

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

శంకర్‌పల్లి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఇస్లామిక్ కాంగ్రిగేషన్ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని జెంబోరీ గ్రౌండ్‌లో జనవరి 4, 5వ తేదీలలో జరిగే ఇస్లామిక్ కాంగ్రిగేషన్ కార్యక్రమ ఏర్పాట్లను చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి మంగళవారం సమీక్షించారు. ప్రార్థనా సమావేశానికి హాజరయ్యే ముస్లింల కోసం అవసరమైన సదుపాయాలు డిసెంబరు 31వ తేదీలోగా పూర్తిచేయాలని సూచించారు. విద్యుత్, వైద్యం, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ తదితర విషయాలపై మాట్లాడారు. 25వ తేదీ వరకు తాగునీటి పైపులు వేసి ట్రయల్ రన్ నిర్వహించాలని, అదేవిధంగా 31వ తేదీ వరకు విద్యుత్ స్తంభాలు వేసి వైర్లు బిగించాలని ఆదేశించారు. పనులు జాప్యం చేయొద్దని సూచించారు. కంట్రోల్ రూమ్ ఆర్డీవో ఆధ్వర్యంలో ఉంటుందని, పూర్తి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అంబులెన్సులు, మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, నార్సింగి ఏసీపీ రమణగౌడ్, మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్ తదితరులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తగా యాప్‌లో నమోదు చేయాలన్నారు ఈ నెలాఖరులోగా వంద శాతం సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టోల్‌ఫ్రీ నెంబర్ 7674961606కు కాల్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సందేహాలుంటే మున్సిపల్, పంచాయతీ అధికారులను సంప్రదించాలన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే దీక్ష

- సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే దీక్షలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి సంఘీభావం తెలిపారు. ఉద్యోగులతో కలిసి ఆయన ధర్నాలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ ఉడుత అశోక్, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలి

తాండూరు రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ఆయా పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు నూతన మెనూను విడుదల చేసిందని, అట్టి మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం అందించాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. మండల పరిధిలోని సిరిగిరిపేట్, కోటబాస్పల్లి, కొత్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా సిరిగిరిపేట్ పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎం మధుసూదనరెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కిచెన్‌లో బియ్యం స్టాక్ రిజిష్టర్ పరిశీలించారు. సమీపంలోని కొత్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


విద్యార్థుల రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కడ్తాల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. గ్రామాలు, తండాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు ప్రైవేట్ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు ముందుకు రావాలని కోరారు. చరికొండలో మంళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉప్పల అఖిల్ ఆధ్వర్యంలోని వైద్యులు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ముందులందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య నియమాలు, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాల్‌కోట నర్సింహా గౌడ్, జె.వీరయ్య, నర్సింహ, కోటేశ్, నరేశ్, ప్రశాంత్, హుస్సేన్, కృష్ణ, గోపాల్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

న్యామతాపూర్‌లో వైద్య శిబిరం విజయవంతమైంది. కలాం ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్, మలక్‌పేట యశోద ఆసుపత్రి సహకారంతో బోదాసు మహేశ్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు ఏఎంసీ ఛైర్‌పర్సన్ యాట గీత ప్రారంభించారు. 225 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులందజేశారు. కార్యక్రమంలో బిచ్యానాయక్, షాబుద్దీన్, బి.రాంరెడ్డి, ఫారుఖ్, జానారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, మల్లేశ్, మహేశ్, కృష్ణ, జయరాములు, బాల్‌రాజ్, రవి, భాను పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న దశరథ్‌నాయక్, వెంకటేశ్

హరితహారం మొక్కలకు నిప్పు


కుర్మిద్దలో కాలిపోయిన చెట్లు

యాచారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కుర్మిద్దలో పెంచుతున్న మొక్కలు చెట్లుగా పెరిగాయి. వాటి వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 15 చెట్లు బూడిదయ్యాయి. దీంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లక్రితం నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి నీడనిస్తున్నాయని, వాటికి నిప్పు పెట్టడం చూసిన పంచాయతీ సిబ్బంది వేదన చెందారు. తాము కష్టపడి మొక్కలను పెంచామని, అవి కాలిపోవడం బాధగా ఉందని పంచాయతీ సిబ్బంది అన్నారు. నిప్పు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా ఉచిత కుట్టుమిషన్లు అందిస్తున్నారని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ మహిళలు (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన్స్ లేదా పారిస్) వారు ఆన్‌లైన్‌లో టీజీవోబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవీ.ఐఎన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, హార్డ్ కాపీ జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7993357103 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

భక్తి మార్గం సమాజ శాంతికి దోహదం


పూజల్లో గూడూరు శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల భక్తి, దైవ మార్గంలో నడిస్తే మానవాళి పురోగమనానికి, శాంతి స్థాపనకు దోహదపడుతుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కడ్తాలలోని శివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆలయంలో గురుస్వాములు మహేశ్, రాజు, శ్రీకాంత్ నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, వెంకటేశ్, పిప్పళ్ల వెంకటేశ్, క్యామ రాజేశ్, లక్ష్మణ్, మహేశ్, భగీరథ్, టిల్లు, శేఖర్, కార్తీక్, భక్తులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి అదృశ్యం


కొత్తగడి విష్ణు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం రాంనాథ్‌గుడ్‌పల్లికి చెందిన కొత్తగడి విష్ణు(17) బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. కాలేజి హాస్టల్‌లో ఉంటున్న అతడు ఈ నె 14న కాలేజీ నుంచి ఎటో వెళ్లిపోయాడు. విష్ణు తండ్రి బాల్‌రాజ్ కుమారుడికి ఫోన్‌చేసినా స్పందన లేదు. దీంతో సోమవారంరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వికారాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సదుపాయాలన్నీ తమకు వర్తింపజేయాలని జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కె.గాంగ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ నిరవధిక సమ్మె నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల్లో ఒకరు అంబేడ్కర్ వేషధారణతో సమ్మె వేదిక వద్ద కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. అంతకు ముందు తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిలాల్, కె.రాంరెడ్డితో పాటు పలువురు ఎంఈవోలు, జీహెచ్‌ఎంలు సమగ్ర శిక్షా ఉద్యోగులకు తమ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జేఏసీ ప్రతినిధులు శేఖర్, రవికుమార్, ప్రభావతి, రాజేశ్వరి, స్వరూప, స్రవంతి, ఆశాలత, వెంకటొరెడ్డి, రఘు, మోహన్, కృష్ణవేణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రైల్వే వంతెనకు మరమ్మతులు చేయించాలి


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ రైల్వేవంతెన గుంతల మయమైందని, వెంటనే మరమ్మతులు చేయించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వనతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా వంతెనపైన పలుచోట్ల ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయని, ప్రమాదాలు జరుగక ముందే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గణేష్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ఆదిభట్ల-నాదర్‌గుల్ రోడ్డును నాలుగు లేన్లుగా మార్చండి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల నుంచి నాదర్‌గుల్ వరకు ఉన్న రోడ్డును నాలుగు లేన్లకు విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డికి ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని టీజీఐఐసీ కార్యాలయంలో ఆయన వినతి పత్రం అందజేశారు. అంతేగాక ఈ రోడ్డుకు రతన్ టాటా పేరు పెట్టాలన్నారు. ఆదిభట్ల టీసీఎస్ ఆవరణలో రతన్‌టాటా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు.


విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

'కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన'

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అన్యాయం అని, గత బీఆర్‌ఎస్ బాటలనే రేవంత్‌రెడ్డి సర్కార్ నడుస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారవ నగరంలోని ఇందిరాపార్కుకు మహాధర్నాకు వెళ్తున్న వారిని పోలీసులు ఆరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆరెస్టును దేవేందర్ ఖండించారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని.. ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు రత్నం, అంజనేయులుగౌడ్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే


ఆమనగల్లులో సర్వే నిర్వహిస్తున్న కమిషనర్ వసంత

ఆమనగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ఎంపీడీవో, మున్సిపాలిటీ వార్డుల్లో కమిషనర్ మంగళవారం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తూ ఇళ్లు లేని పేదలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలను అనుసరించి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు విజయ్‌రాథోడ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్ పాల్గొన్నారు.

తట్టేపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి

శాసన సభలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామం యూనిట్‌గా మండల కేంద్రాన్ని ప్రకటించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కచ్చితంగా కొత్త మండలాన్ని ప్రకటించాలని ఆయన కోరారు. చాలా రోజులుగా తట్టేపల్లిని మండల కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేశారని ఆయన గుర్తుచేశారు. అన్ని అర్హతలు ఉన్న ఈ ప్రాంతాన్ని రెవెన్యూ మంత్రి మండలంగా ప్రకటించాలని కోరారు.

ప్రజలందరికీ మేలు జరగాలి



రంగరాజన్‌ను సన్మానిస్తున్న శ్రీహరి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం అవతరించిన అయ్యప్ప స్వామి దీవెనలతో సమస్త జీవులకు మేలు కలగాలని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్ ఆకాంక్షించారు. మంగళవారం మొయినాబాద్‌లో పెద్దమంగళారానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కటికె శ్రీహరి నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమానికి రంగరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ వ్యక్తి దైవ చింతన కలిగి ఉండాలని, దానితోనే సన్మార్గం, ఆరోగ్యం సాధ్యమన్నారు. పూజ సందర్భంగా ఖైరతాబాద్‌కు చెందిన నర్సింగ్‌రావు ఆలపించిన అయ్యప్ప భజన గీతాలు ఆకట్టుకున్నాయి. మెట్ల పూజలో స్వాములు ఆడిపాడారు. కార్యక్రమంలో మాలధారులు ఉమాశంకర్‌రెడ్డి, రాంచందర్, సురేందర్‌గౌడ్, వివిధ ప్రాంతాల స్వాములు పాల్గొన్నారు.

వందేళ్ల చరిత్ర ఉన్న పార్టీ సీపీఐ



మాట్లాడుతున్న జంగయ్య

చేవెళ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ మాత్రమే పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమకుల జంగయ్య అన్నారు. సీపీఐకి వందేళ్లు నిండుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం కందవాడలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ ఆవిర్భావోత్సవాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 99సంవత్సరాలుగా ప్రజలపక్షాన పోరాడుతున్నది సీపీఐ అని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణచారి, మంజుల, వెంకటయ్య సత్తయ్య, పద్మ, పెంటయ్య గోపాల్, సుధాకర్‌గౌడ్, బుచ్చయ్య, రాంచంద్రయ్య, లలిత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు, నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల భక్తులు తరలొస్తున్నారు. మంగళవారం ప్రత్యేకపూజలు, అభిషేకాలు, చక్రతీర్థం, నాగబలి నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి, ఏవో స్నేహలత పాల్గొన్నారు.

ఎంపీలను కలిసిన బీజేపీ నాయకులు



ఎంపీలతో షాద్‌నగర్ బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య మంగళవారం ఢిల్లీలో ఎంపీలను మర్యాదపూర్వకంగా కలిశారు. మెదక్, చేవెళ్ల, ఆదిలాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేష్‌లను కలిసి పలు విషయాలను వారి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. వారి వెంట యువమోర్చా రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ ఉన్నారు.

ఉపాధి హామీ లెక్కలు పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కొత్తూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పనుల లెక్కలను పక్కాగా నిర్వహించాలని ఉపాధి హామీ పథకం ప్రిసైడింగ్ అధికారి జి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తూరు మండలంలో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాల సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పనులకు బిల్లులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలొచ్చినప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. మండలంలో చేపట్టిన పనుల లెక్కల్లో తప్పులున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏపీడీ, అంబుడ్స్‌మన్ సునీతామూర్తి, సీసీ, పీఆర్ అధికారులు పాల్గొన్నారు.

మండల సాధనకు పోరాటం ఉధృతం



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లి గ్రామస్తులు మండల కేంద్రం సాధన పోరాటాన్ని ఉధృతం చేశారు. సమీప గ్రామాలు, తండా వాసులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారానికి 48వ రోజుకు చేరాయి. దీక్షలో మహిళలు, జేఏసీ నాయకులు, యువకులు పాల్గొన్నారు. వెంకట్రావ్‌పేట, ఖానాపూర్, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, గౌరిపల్లి, బల్సుపల్లి తండా, చౌదర్‌పల్లి, కేపీతండాలను కలిపి గట్టిప్పలపల్లి మండల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ అశోక్‌గౌడ్, శరత్‌చంద్ర, ఆంజనేయులు, నర్సింహ, యాదయ్య లక్ష్మయ్య, చెన్నయ్య, జంగయ్య, మల్లేశ్ పాల్గొన్నార.



పరిగి శివారులో నారుమడిలో పలుచగా ఉన్న వరినారు

యాసంగి సాగుకు నారు సమస్య!

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పెరగని వరినారు

- వాతావరణంలో మార్పులే కారణమా?
- రెండెకరాలకు నారు పోస్తే అర ఎకరం రాని పరిస్థితి
- ఆందోళనలో రైతులు

పరిగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరిసాగుకు నారు సమస్య తలెత్తింది. వానాకాలం సీజన్‌లో కలిసిరాని కాలంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు యాసంగిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కరియట్లు, నార్లు పోసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే వరిసాగులో నారుమళ్లు ఆశించినమేర మెరగక రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఈ సమస్య తలెత్తుతోంది. తీవ్రమైన చలిగాలులు, సారవంతమైన భూములు లేకపోవడం, ముఖ్యంగా జింక్‌లోపం, విత్తనాల సమస్యతో నారుమళ్లు ఏమాత్రం పెరగడంలేదు. మొలక ఆకుపచ్చగా కాకుండా పసుపు పచ్చగా మారి వేసిన నారు నిరుపయోగంగా మారుతోందని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అసలు నారుమడి నుంచే మొలకలు సరిగ్గా రావడం లేదు. వారం రోజుల పాటు నీళ్లలో నానబెట్టిన మొలక రావడంలేదని, ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. విత్తనాల్లో నాణ్యత లేమితో ఇలా అవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేయని కారణంగా రైతులు మార్కెట్‌లో కొనుగోలుచేసి నారుమళ్లు పోసుకున్నారు. ఇలాంటి విత్తనాలు అసలు సగం కూడా మొలకెత్తక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. నారుమళ్లే ఇలా ఉంటే వరి పైరుకు ఎన్ని రోగాలు వస్తాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 60వేల ఎకరాలకుపైగా వరిసాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 60 వేల ఎకరాలకుపై వరి సాగు చేయనున్నారు. జిల్లాలోని పరిగి, దోమ, కులకచర్ల, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల, తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో చెరువులు, బోర్ల కింద వరిని విస్తారంగా సాగుచేస్తున్నారు. చెరువులతో పాటు 70వేలకు పైగా ఉన్న బోర్ల కింద వరిని సాగు చేయడం ప్రారంభించారు. అయితే వరినారు రెండెకరాలకు పోస్తే అరెకరం కూడా సరిపోకపోవడం ఏం చేయాలో తోచడం లేదని రైతన్నలు దిగులు చెందుతున్నారు. మళ్లీ నారు వేయడానికి సమయం సరిపోదు. ఏ రైతు నోట విన్నా నారు సరిగ్గా లేదన్న మాటే వినిపిస్తోంది.

చలిగాలులతోనే సమస్య



యాసంగి వరిసాగుకు వరినారు సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. ఈసారి చలి తీవ్రంగా ఉంది. మొలక దశలోనే ఇబ్బందిగా ఉంది. నానబెట్టిన వడ్లు వారం రోజులైనా మొలక రావడం లేదు. ఒకవేళ మొలక వచ్చిన దాన్ని కరియట్లో చల్లినా పైకి ఎదగడం లేదు. రెండు ఎకరాలకు పోసిన అరఎకరానికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

- కాకి కృష్ణ, రైతు, మిట్టకోడూరు

నారుమళ్లకు జాగ్రత్తలు అవసరం



నారుమడి ఏర్పాటుకు పది రోజుల ముందే దుక్కిని చదును చేసుకోవాలి. నారుమడిలో నీరు తీసివేయడానికి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. మళ్లలో అసలు నీరు నిల్వ ఉంచరాదు. రెండున్నర గుంటల నారుమడికి 2కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 2 కిలోల పొటాష్ వేసుకోవాలి. వరినారు ఆకులు వేసే దశ వచ్చేవరకు నీరు పలుచగా ఉండేలా చూసుకోవాలి. చలి ఎక్కువగా ఉన్నందున ఆకులకు ఇటుక పొడిరంగులో మచ్చలు వస్తాయి. ఈ రంగుల మచ్చలు రాకుండా 2గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి నారుమడికి స్ప్రే చేయాలి. చిగురాకు తెల్లగా మారితే ఒక లీటరు నీటికి 20గ్రాముల అన్నాబేడి, 2గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి స్ప్రేచేయాలి. నారు వేసిన పది రోజులకు కార్బోఫ్యూరాన్(వాసనలేని గుళికలు), కార్బన్‌ను సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. నారువేసిన పొలం అంతా కొట్టుకోలేని వారు నారుమడికి స్ప్రే చేసుకోవచ్చు. నారు వేసిన తరువాత పొలానికి ఆరు తడిగా నీటిని అందిస్తుండాలి. మంచుకు రాత్రిపూట కవర్లు కప్పి ఉదయం తెసివేస్తే నారు సమస్యను అధిగమించవచ్చు.

- లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దేప భాస్కర్‌రెడ్డి

ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

మహేశ్వరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని మహేశ్వరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరంలోని అక్కన్న మాదన్నల కాలంనాటి గడికోట ప్రాంగణంలో సీఎం కప్ క్రీడా పోటీలు జరిగాయి. పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యతో పాటు క్రీడలకు ప్రోత్సాహం లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సాంకేతిక విద్య, ఆటలకు ప్రోత్సాహం ఇస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తన సొంత డబ్బుతో విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నారన్నారు. విజేతలకు కప్పులను అందజేశారు. కార్యక్రమంలో ఎండీవో శైలజారెడ్డి, ఎంఈవో కస్నానాయక్, నాయకులు మల్లేష్‌యాదవ్, కాకి ఈశ్వర్, రఘుపతి, సుదర్శన్, నర్సింహ, సాంబయ్య, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

కార్మికుల అరెస్ట్ సరికాదు

తాండూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడితే అరెస్ట్ చేసి కార్మికులను అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన ఖండించారు. కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, ఉద్యమాలను అణిచి వేయాలని చూస్తున్నారని ఆయన అన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



షాద్‌నగర్ ఆర్డీవో సరితను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు



ఆమనగల్లు: రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్, పురుషోత్తంరెడ్డి తదితరులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని షాద్‌నగర్ ఆర్డీవో సరిత అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం నేషనల్ పెన్షనర్స్ డేను జరుపుకున్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ షాద్‌నగర్ బ్రాంచ్ అధ్యక్షుడు రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వచ్చిన ఆర్డీవోను సత్కరించారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ అనుభవాన్ని, విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఏటీవో బాల్‌రాజ్, ఎస్టీవో మహేష్, ఠాగూర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్, నాయకులు జనార్దన్, జగదీశ్వర్, డి.శేఖర్, పాండు, సత్యనారాయణగౌడ్, నర్సింహులు, నాగేష్, షబ్బీర్, స్వరాజ్‌బాబు, గోపాలస్వామి, గోపాల్‌రావు, నారాయణరెడ్డి, రమాదేవి, గిరిజ, అంజు, సామ్రాజ్యం, గప్పార్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: పెన్షనర్స్ డేను ఆమనగల్లులో పెన్షనర్ల సంఘం, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో జరుపుకున్నారు. సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల రిటైర్డ్ ఉద్యోగులు హాజరయ్యారు. సంఘం ఆమనగల్లు యూనిట్ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకకు విద్యాశాఖ రిటైర్డ్ ఆర్జేడీ పసుల లక్ష్మారెడ్డి, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎంఈవో పాండు, రిటైర్డ్ పోలీస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సంఘ సేవకుడు పి.రాము, మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య హాజరయ్యారు. పెన్షనర్ల హక్కులు, సంక్షేమ కార్యక్రమాలపై పురుషోత్తంరెడ్డి వివరించారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ భవన్‌కు స్థలాన్ని కేటాయించామని వైస్ చైర్మన్ తెలిపారు. విరమణ ఉద్యోగానికేగానీ సామాజిక సేవలకు కాదని వక్తలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ట్రెజరర్ వి.నారాయణగౌడ్, సత్యనారాయణ, నారాయణగౌడ్, గుర్రం భద్రయ్య, యాదగిరి, మహాలింగం, విద్యాధర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, మహబూబ్ అలీ, జి.యాదగిరి, కసిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, అశోక్‌రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలాల్లో సరైన వసతులు కల్పించాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కీసర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సరైనా వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కీసరలోని మహత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎలుకల దాడిలో విద్యార్థులకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందించిన విషయం తెలిసిందే. ఇట్టి విషయంపై మంగళవారం బీజేపీ నాయకులు విద్యార్థులను పరామర్శించేందుకు పాఠశాలకు వెళ్లారు. విద్యార్థులు తరగతి గదిలో ఉండటంతో నిర్వాహకులు నాయకులను లోపలికి అనుమతించలేదు. దీంతో బీజేపీ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలంటూ నినాదాలు చేశారు. పాఠశాల నిర్వాహకుల సమాచారంతో ఎస్ఐ వెంకటేష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. తరగతి గదిలో పిల్లలకు అసౌకర్యం కలిచవద్దని, విద్యార్థులు క్షేమంగా ఉన్నారని ఆయన పాఠశాల నిర్వహకుల ద్వారా తెలుసుకొని బీజేపీ నాయకులకు నచ్చజెప్పారు. దీంతో బీజేపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లా వెంకట్ రెడ్డి, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిర్మాణ రంగ కార్మికులకు సదుపాయాలు కల్పించాలి

శంషాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, వారికి ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అవ్వాన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి బాలరాజు మాట్లాడారు. నిర్మాణ భవనాలకు లేబర్ డిపార్టుమెంట్ సెస్సు రూపంలో వసూలు చేస్తున్న డబ్బులను కార్మికుల సంక్షేమానికే వెచ్చించాలన్నారు. 2025 ఏప్రిల్‌లో శంషాబాద్‌లో నిర్మాణ రంగ కార్మికుల రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్మికులు పి.పర్వతాలు, పామిడి శేఖర్‌రెడ్డి, ఎన్.మల్లేష్, చందు, హరిసింగ్, టి.రామకృష్ణ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించొద్దు: డీఎస్పీ

దోమ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వ్యవహరించొద్దని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పోలీసులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల నుంచి ప్రతీ ఫిర్యాదును స్వీకరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసు విధానంతో ప్రజలతో మమేకమవుతూ బాధితులకు న్యాయం చేయాలన్నారు. నిఘాను పటిష్ఠం చేసేందుకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

అంతరిస్తున్న కళలను కాపాడాలి



కళాకారులలతో టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతన్న గ్రామీణ కళలు, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వీధి నాటకాలు చరిత్రను గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. బాల భీమాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చౌదర్‌పల్లిలో నిర్వహించిన సంపూర్ణ రామాయణం నాటకాన్ని మంగళవారం రాఘవేందర్‌రెడ్డి తిలకించారు. కళాకారులను సత్కరించారు. వీధి నాటకాల పునరుజ్జీవనానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. నాటకాలు, కళలు, కళారూపాలు భారతీయ సంస్కృతికి ప్రతిబింబాలన్నారు. పాతతరం నాటక కళాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనిచ్చి కొత్త తరం వారు వచ్చేలా కృషి చేయాలని కోరారు. టీవీలు, సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో వీధి నాటకాలకు ఆదరణ తగ్గిందని అన్నారు. ప్రజాచైతన్య కార్యక్రమాల్లో ఇప్పటికీ కళాకారుల పాత్రే కీలకంగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ ఈఎం వరప్రసాద్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు చెన్నయ్య, భీమయ్య, ముకుంద, ఆనంద్, యాదయ్య. తిరుపతయ్య, మహేందర్, హన్మంత్, కృష్ణయ్య, రాజేందర్, పెంట్యానాయక్, మాసయ్య, అనంతయ్య పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించే వరకు ఆందోళన



మాట్లాడుతున్న అర్జున్‌రావు, శ్రీను, అనురాధ

ఆమనగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులపై సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి.అర్జున్ రావు, మాజీ జడ్పీటీసీ అనురాధ, పార్టీ జిల్లా నాయకుడు వి.శ్రీను నాయక్ కోరారు. సర్పంచ్‌ల బిల్లులివ్వకుండ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. బిల్లులిచ్చే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఆమనగల్లులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు వేదనకు గురవుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. కాంట్రాక్టర్లకు రూ.వేలకోట్లు చెల్లిస్తున్న పాలకులు మాజీ సర్పంచ్‌ల బిల్లులు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్‌ల బిల్లులపై మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో లేవనెత్తడం హర్షదాయకమన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై నిందలేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు జి.బాలస్వామి, ఖలీల్, జి.శంకర్, శివకుమార్, పరమేశ్, రమేశ్, సైదులుగౌడ్, సాయిలు, గణేశ్ పాల్గొన్నారు.

కార్యదర్శులపై నిర్వహణ భారం

- ప్రజాపనుల కోసం సొంత డబ్బులు ఖర్చు
- బిల్లుల కోసం ఉద్యోగుల ఎదురుచూపు

యాచారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు ప్రజాప్రతినిధుల పాలకవర్గాలు లేక గ్రామాల నిర్వహణ భారం పంచాయతీ కార్యదర్శుల పైనే పడుతోంది. వివిధ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో నిధులివ్వక 10 నెలలుగా కార్యదర్శులు అప్పుచేసి పంచాయతీ నిర్వహించాల్సిన పనులు చేయిస్తూ ప్రజాసమస్యలు తీరుస్తున్నారు. తాగు నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలపడం, స్ట్రీట్‌లైట్ల నిర్వహణ, దోమల నివారణకు ఫాగింగ్, నీటి సరఫరా మోటర్ల మరమ్మతులు, ట్రాక్టర్‌కు డీజిల్, రిపేర్లు వంటి పనులకు నిత్యం ఎంతో కొంత ఖర్చు చేయాల్సి వస్తోంది. అయితే పంచాయతీల ఖాతాల్లో నగదు లేక గ్రామ పనులకు కార్యదర్శులు సొంత డబ్బును వెచ్చిస్తున్నరు. దీనికి కొందరు అప్పులు సైతం చేస్తున్నారు.



యాచారం గ్రామ పంచాయతీ కార్యాలయం

డివిజన్‌లో 61 పంచాయతీలు

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 61 గ్రామ పంచాయతీలున్నాయి. యాచారం మండలంలో 24, మంచాలలో 23, ఇబ్రహీంపట్నంలో 14 పంచాయతీలున్నాయి. వీటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వాలి. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచీ ప్రభుత్వాల నిధులు రావడం లేదు. 2024 ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. గ్రామాల్లో పనులకు సర్పంచ్‌లు సైతం అప్పులు చేశారు. వాటి బిల్లులు చెల్లించాలని తరచూ ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. ఈ నేథ్యంలో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన అనంతరం కార్యదర్శులు వెచ్చిస్తున్న డబ్బుకు బిల్లులు ఎప్పుడిస్తారనేది సందేహాస్పదంగా మారింది. పీఎస్‌లు తమ జీతాల నుంచి డబ్బుఖర్చు చేయడమేకాక ఆ మొత్తం సరికపో వ్యక్తిగత అప్పులు సైతం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీసీ చార్జీలు, కార్మికుల జీతాలకు ఒక్కో మండలానికి రూ.12లక్షలు విడుదల చేసింది. గ్రామాల్లో వసూలయ్యే ఇంటి, వృత్తిపన్నుల మొత్తం పంచాయతీ కార్మికుల జీతాలకు కూడా సరిపోవడం లేదు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు సైతం చేతులెత్తేశారు. ఇప్పటి వరకు ఒక్కో పంచాయతీ కార్యదర్శి గ్రామ జనాభాను బట్టి గ్రామ పనులకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు వెచ్చించారు. తాము చేసిన నిర్వహణ పనులకు డబ్బు చెల్లించకుంటే పరిస్థితి ఏమిటనేది కార్యదర్శులను తొలుస్తున్న ప్రశ్న. కలెక్టర్, డీపీవోలు చర్యలు తీసుకొని బిల్లులుచెల్లించాలని పీఎస్‌లు కోరుతున్నారు.

కార్యదర్శులు చేసిన పనుల బిల్లులు ఇస్తాం



గ్రామాల్లో ప్రజల సమస్యలు తీర్చడానికి పంచాయతీ కార్యదర్శులు వారి సొంత డబ్బు వెచ్చిస్తున్న మాట వాస్తవమూ. గ్రామాల్లో చేయించిన పనులకు ఎంబీ రికార్డుల ఆధారంగా అయిన మొత్తాన్ని, కార్యదర్శులు పెట్టిన ఖర్చులను లెక్కగట్టి బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాస్తాం. తమ డబ్బు వస్తుందా? రాదా? అనే దానిపై పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామానికి ఖర్చు పెట్టిన ప్రతీ రూపాయి ప్రభుత్వం చెల్లిస్తుంది.

- సాధన, డివిజనల్ పంచాయతీ అధికారి

క్రైం కార్నర్

స్తంభాన్ని ఢీకొన్న కారు.. డ్రైవర్‌కు గాయాలు


ప్రమాదంలో గాయపడిన విశ్వనాథ్

షాద్‌నగర్ రూరల్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ట్యాక్సీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి జాతీయ రహదారి రాయికల్ టోల్‌ప్లాజా వద్ద మంగళవారం జరిగింది. ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్ శెట్టి (55) తన కారులో షాద్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విశ్వనాథ్ తలకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ట్రాఫిక్ సీఐ, ఎస్సై రవీందర్ వెంటనే క్షతగాత్రుడికి పోలీసు వాహనంలో షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. విశ్వనాథ్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని చంద్రశేఖర్ తెలిపారు.

బాలుడి మృతికి కారకుడైన వ్యక్తికి ఏడేళ్ల జైలు


దర్శనాల బాల్‌రాజ్

షాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ఓ బాలుడిని ఎక్కించుకొని అజాగ్రత్తగా వాహనం నడిపి బాలుడి మృతికి కారకుడైన వ్యక్తికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. దీనికి సంబంధించి షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంతారానికి చెందిన దర్శనాల బాల్‌రాజ్ 3-12-2020న తన స్కూటర్‌పై ఓ బాలుడిని ఎక్కించుకొని సర్దార్‌నగర్‌కు వెళ్తుండగా స్కూటర్‌ను వేగంగా నడిపాడు. రోడ్డు మీద వస్తున్న లారీని చూసుకోకుండా లారీ ముందుకు వెళ్లడంతో లారీ ఢీకొని వెనక కూర్చున్న బాలుడు పడిపోయి మృతిచెందాడు. అప్పట్లో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం కోర్టులో నేరం రుజువు కావడంతో ఎల్బీనగర్ జిల్లా కోర్టు బాల్‌రాజ్‌కు ఏడు సంవత్సరాలు జైలు శిక్షవిధించిందని ఆయన వివరించారు.

వ్యక్తి అదృశ్యం


మెట్టు భాస్కర్

శంషాబాద్ రూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన మెట్టు భాస్కర్(37) ఈ నెల 16న హిమయత్‌సాగర్‌లో చేపల వేటకని వెళ్లాడు. అతడు ఇప్పటికీ రాలేదు. దీంతో మంగళవారం కుటుంబ సభ్యులు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంపీని భయపెట్టిన సైబర్ నేరగాడు

- కొడుకును అరెస్టు చేశామంటూ ఫేక్ కాల్

యాచారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓ సైబర్ నేరగాడు ఆర్ఎంపీని భయపెట్టిన ఉదంతం మంగళవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధి మేడిపల్లిలో వెలుగులోకొచ్చింది. మేడిపల్లికి చెందిన రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ పి.రవీందర్‌గుప్తా కుమారుడు ప్రదీప్‌కుమార్ ఆస్ట్రేలియాలో చదువుతున్నాడు. ఉదయం 11:30గంటలకు ఓ సైబర్ నేరగాడు 923083046876 నంబర్‌తో రవీందర్‌కు ఫోన్ చేసి.. 'నేను ఆస్ట్రేలియా పోలీస్ అధికారిని మాట్లాడుతున్నా. మీ కొడుకు ప్రదీప్‌కుమార్, మరో ముగ్గురు యువకులు ఓ యువతిపై అత్యాచారం చేశారు. మీ కుమారుడిని అరెస్టు చేశాం. ఇదిగో మీ ప్రదీప్‌కుమార్ ఏడుస్తున్నాడు.' అని ఏడుపు వినిపించాడు. దాంతో పి.రవీందర్‌గుప్తా తన కొడుకు నంబర్‌కు ఫోన్ చేయగా తాను ఇంట్లో ఉన్నట్టు చెప్పాడు. బెదిరింపు కాల్‌పై రవీందర్‌గుప్తా గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులకు సమాచారమిచ్చాడు. ఇలాంటి ఫేక్‌కాల్స్ రిసీవ్ చేస్కోవద్దని, పుకార్లు నమ్మొద్దని పోలీసులు సూచించారు.

వైన్ షాప్‌లో చోరీ

షాద్‌నగర్ రూరల్ డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో కేశంపేట బైపాస్ రోడ్డు పక్కన ఉన్న లక్కీ వైన్ షాప్‌లో సోమవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. షాప్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 12గంటల తర్వాత దొంగలు వెనుక వైపు గడ్డ పారలతో తలుపులు పగులగొట్టి చొరబడ్డారు. రూ.5వేల నగదు, రూ.20వేల విలువ గల లిక్కర్‌ను ఎత్తుకపోయారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల
సర్వేకు సహకరించాలి

కేశంపేట/చౌదరిగూడ/షాబాద్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి కోరా రు. కేశంపేట, బొదునంపల్లి, నిర్దవెల్లి, కాకునూర్ గ్రామాల్లో ఇళ్ల మొబైల్ యాప్ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వేకు 36మంది సర్వేయర్లు, ఆరుగురు సూపర్‌వైజర్లను నియమించామన్నారు. అధికారులకు ఆధార్/రేషన్ కార్డులు, ఇంటి స్థలం దస్తావేజులు చూపించాలని సూచించారు. కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ మండలాల్లోని రావిర్యాల, తుమ్మలపల్లి, ముష్టిపల్లి, చేగిరెడ్డి ఘణాపూర్, గాలిగూడెం, గుర్రంపల్లి, ఎదిర గ్రామాల్లో సర్వేను డిప్యూటీ ఈఈ షకీర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, నాగేందర్, జగన్‌మోహన్‌రెడ్డి, అఫ్సర్, మాజీ సర్పంచులు బాల్‌రాజ్, శివమౌళి ఉన్నారు. సర్వేకొచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని షాబాద్ ఎంపీడీవో అపర్ణ అన్నారు. పోతుగల్, ముద్దెంగూడలో సర్వేను పరిశీలించారు. పంచాయితీ కార్యదర్శులు అశోక్, శోభ ఉన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్
నూతన కమిటీ ఎన్నిక

మంచాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మంచాల మండల పరిధి ఆరుట్ల గ్రామానికి చెందిన భారతీయ కిసాన్ సంఘ్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు బీకేఎస్ ప్రతినిధి దండు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా చెరుకు రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా చిందం ఐలయ్య, దండు గోపాల్‌రెడ్డి, కార్యదర్శిగా చిందం శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా మాడపాకుల కృష్ణయ్య, పూజరి బాలరాజు, కార్యవర్గసభ్యులుగా చిందం పాండు, రావుల బుచ్చయ్య, మాదగోని రాజు, పాండాల రాములు ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన


కందుకూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు/చేవెళ్ల/మంచాల/ఆమనగల్లు/కడ్తాల్/శంషాబాద్/మొయినాబాద్ రూరల్/ఇబ్రహీంపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల కోసం అడుగుతున్న వారిని జైళ్లలో పెడుతున్నారని, కంపెనీల కంటూ పేదల భూములను లాక్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరంకుశ పాలన సాగుతోందని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. కందుకూరు ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కాకి దశరథ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. భూములను ఇవ్వం అని అన్న లగచర్ల రైతులను అరెస్టు చేసి జైలుకు పంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఇందిరదేవేందర్, సురేష్, మేఘనాథ్‌రెడ్డి, దేవేందర్, కార్తీక్, లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, ఆనంద్,దామోదర్‌గౌడ్, దీక్షిత్‌రెడ్డి, వెంకటేష్, జ్యోతిచంద్రశేఖర్, పర్వతాలు, జంగయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. చేవెళ్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్, వంగ శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ బి.నర్సింలు, కృష్ణ, ఘనీ, రాంప్రసాద్, రాజు, మాణిక్యరెడ్డి, జైపాల్ రెడ్డి, పాండు, కుమార్‌గౌడ్, మహేందర్, వెంకటేశ్, ఎల్లయ్య ఉన్నారు. మంచాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు చీరాల రమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. నాయకులు బహదూర్, ఎన్.వెంకటేష్‌గౌడ్, ఇందిర, అనిత, జగన్‌రెడ్డి, బద్రీనాథ్‌గుప్తా, కిషన్‌రెడ్డి, విజయ్‌కుమార్, శంకర్, ప్రశాంత్, మధు, అశోక్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు. ఆమనగల్లులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ అనురాధ, మండల అధ్యక్షుడు అర్జున్‌రావు హాజరయ్యారు. నాయకులు శ్రీను, ఖలీల్, గుత్తి బాలస్వామి, రమేశ్, సాయిలు, శివకుమార్, సైదులుగౌడ్, రమేశ్, గణేశ్, శంకర్, పరమేశ్, పంతూనాయక్, శివ పాల్గొన్నారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలన సాగిస్తోందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాలలో బీఆర్ఎస్ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహం ధర్నా చేసి విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు లచ్చిరామ్, వీరయ్య, రమేశ్, చంద్రమౌళి, పంతూనాయక్, హరిచంద్, పాండు, గోపాల్, రాజు, బాబా, రమేశ్, మల్లేశ్, పవన్, అంజి, శ్రీకాంత్, శ్రీను, వినోద్, రాజశేఖర్, రాములు, జంగయ్య, అంజద్, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తోందని, రైతులు పొలాలను ఫార్మా కంపెనీకి ఇవ్వం అన్న పాపానికి వారిపై కేసులు పెట్టి జైలుకు పంపారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్, మల్కారం సింగిల్ విండో చైర్మన్ బూర్కుంట సతీష్ అన్నారు. శంషాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మోహన్‌రావు, అశోక్, చరణ్, రమేష్, రాజూనాయక్, పరంధాములు, జగదీశ్వర్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీశైలం, శ్రీనివాస్, నర్సింహ, మురళి పాల్గొన్నారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులు విరమించుకునే వరకు పోరాటం చేస్తామని జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మానిక్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నేతలు గిరిజన, దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రాఘవరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, సుమన్, పద్మయ్య, ప్రవీన్‌రెడ్డి, రవి, యాదగిరి, షరీఫ్, ఆసిఫ్ ఉన్నారు. లగచర్ల రైతులపై కేసులను ఎత్తివేయాలని ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మాజీ ఎంపీపీ కృపేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బుగ్గ రాములు, మున్సిపల్ అధ్యక్షుడు ఎ.వెంకట్‌రెడ్డి, నాయకులు యాదగిరి, ఏనుగు భరత్‌రెడ్డి, మైసయ్య, కర్నె అరవింద్, నిట్టు జగదీష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కడ్తాలలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రమిస్తున్న నాయకులు దశరథ్, జీఎల్ఎన్ రెడ్డి, లచ్చిరామ్ తదితరులు


ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ నాయకుల నిరసన

ఏబీవీపీ 43వ మహా సభలను
విజయవంతం చేయాలి

చేవెళ్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ మండల నగర కార్యదర్శి మహిపాల్ తెలిపారు. మంగళవారం ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ అన్నారు. ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర మహా సభలు సిద్దిపేటలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. దీనికి విద్యార్థులు అధిక తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నితీష్, కిషోర్, అరవింద్, మల్లేష్, శివ, గణేశ్, ఆభి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చలో హైదరాబాద్‌కు వెళ్తున్న జీపీ కార్మికుల అరెస్ట్


కందుకూరు: పోలీస్‌స్టేషన్‌కు తరలించిన మండల కారోబార్, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు

కేశంపేట/కందుకూరు/యాచారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్మికులు మంగళవారం 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తలపెట్టారు. కార్మిక సంఘం నాయకుల పిలుపు మేరకు వివిధ మండల కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్దామనుకున్న కార్మికులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. కార్మికులను, నాయకులను అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. అనంతరం సాయంత్రం కార్మికులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కేశంపేట నుంచి పంచాయతీ కార్మికులు తరలివెళ్తరన్న సమాచారంతో ఇన్‌స్పెక్టర్ నరహరి ఆదేశాలతో పాండు, రాంచంద్రయ్య, రవి, మరికొందరు కార్మికులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కందుకూరు మండల నేతలను అరెస్టు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి కారోబార్లు, పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు శంకర్ నాయక్, బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించి, జీవో 60 ప్రకారం కేటగిరిల వారీగా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేందర్, రాజయ్య యాదయ్య పాల్గొన్నారు. చలో హైదరబాద్ కార్యక్రమానికి వెళ్తున్న యాచారం మండల పంచాయతీ కార్మికులను హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు, యాచారం ముందస్తు అరెస్టు చేశారు. సాయంత్రం విడుదల చేశామని పోలీసులు తెలిపారు.


కేశంపేట పోలీస్ స్టేషన్‌లో జీపీ కార్మికులు

కొనుగోళ్లకు కొర్రీలు!

పత్తి మద్దతు ధర(క్వింటాలుకు)	2023-24	2024-25	పెరుగుదల
మధ్యరకం పింజ	6,620	7,121	501
పొడుగు పింజ	7,020	7,521	501

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 16,928 మంది రైతుల నుంచి 49800.7 టన్నుల పత్తిని సేకరించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని 11కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 11,083 మంది రైతుల నుంచి 31329.96 టన్నుల పత్తిని సేకరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మూడు కాటన్ మిల్లుల్లో 5,268మంది రైతుల నుంచి 17604.15 టన్నుల పత్తిని సేకరించారు. చేవెళ్ల మండలం ఆలూరు పరిధి శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్‌లో 577మంది రైతుల నుంచి 866.59 ట న్నుల పత్తిని సేకరించారు. చౌదరిగూడ మండ లం వనంపల్లి సూపర్ కాటన్ జిన్నింగ్ మిల్లులో 605మంది రైతుల నుంచి 1790.69 టన్నులు, ఫరూక్‌నగర్ మండలం ఎలికట్టలోని శ్యామ్ కాటెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 1,137 మంది రైతుల నుంచి 3550.54 టన్నుల పత్తిని సేకరించారు. నందిగామ వినాయక కాటన్ మిల్లులో 709మంది రైతుల నుంచి 2023.23 ట న్నులు, షాద్‌నగర్ మండలం చిలకమర్రి రాఘవేంద్ర కాటన్ మిల్లులో 2,151మంది రైతుల నుంచి 5,183.12 టన్నుల పత్తిని సేకరించారు. చౌదరిగూడ మండలం వనంపల్లి శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్‌లో 1,606 మంది రైతుల నుంచి 5745.23 టన్నులు, ఫరూక్‌నగర్ మండలం సోలీపూర్ గ్రామ పరిధిలోని గార్గ్ ఇండస్ట్రీస్‌లో 851మంది రైతుల నుంచి 2537.88 టన్నుల పత్తిని సేకరించారు. అలాగే నందిగామలోని తుల్జా భవాని కాటెక్స్‌లో 1,258 మంది రైతులు 2,841.42 మెట్రిక్ టన్నులు, ఫరూక్‌నగర్ మండలం చిలకమర్రిలోని దొదియ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో 1,024 మంది రైతుల నుంచి 2,119.77 టన్నులు, నందిగామలోని హరిహర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 1,304 మంది రైతుల నుంచి 4,308.58 టన్నులు, కొత్తూరు మండలంలోని తిరుమల ట్రేడింగ్ కంపెనీలో 438 మంది రైతుల నుంచి 1157.5 టన్నుల పత్తిని సేకరించారు. కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లు మండలం తలకొండపల్లిలోని శ్రీనివాస మురుగన్ ఇండస్ట్రీస్‌లో 1,434 మంది రైతుల నుంచి 5292.5 టన్నులు, ఆమనగ ల్లు మండలం ఆకుతోటపల్లిలోని ఎస్టీటీ కాటన్ ఇండస్ట్రీస్‌లో 1,666మంది రైతుల నుంచి 5287.13 టన్నులు సేకరించారు. అలాగే పోలెపల్లిలోని అభిషేక్ మిల్లులో 2,168 మంది రైతుల నుంచి 7,024.52 టన్నుల పత్తిని సేకరించారు.



అమ్మకాలకు నిబంధనలు అడ్డంకి

8-12శాతం తేమ ఉన్న పత్తినే కొనేలా చేసేలా నిబంధనలున్నాయి. అయితే.. ఈ ఏడాది కురిసిన వర్షాలు పత్తి పంటను దెబ్బతీయగా, పంట నాణ్యతా తగ్గింది. వర్షాధారంగా వేసిన పంట సాధారణంగా ఎకరాకు 10-12క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ.. అధిక వర్షాలు తేమ కారణంగా పత్తి కాయరంగు మారి దిగుబడి తగ్గింది. వచ్చిన పత్తిని అమ్ముకుందామనుకుంటే.. సీసీఐ కొర్రీలతో అన్నదాతలు అవస్థ పడుతున్నారు. తేమ ఎక్కువున్నదని, పత్తిలో కాయ వస్తోందని, రంగు మారిందని అధికారులు సాకులు చెబుతూ క్వింటాలు పత్తికి 70-100 రూపాయలు తగ్గిస్తున్నారు. కనీస మద్దతు కన్నా వంద రూపాయలు తక్కువే కొనుగోలు చేస్తున్నారు.

ధరలో కోత పెడుతున్నారు



దళారులకు అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వం పత్తికి రూ.7,521 మద్దతు ధర ఇస్తోంది. కానీ.. తేమ శాతం పేరుతో కొర్రీలు పెడుతూ క్వింటా లు పత్తికి రూ.70 నుంచి రూ.100 తగ్గిస్తున్నారు. మూడు దశల్లో ప త్తి తీస్తాం. కూలీల కొరతతో ఆలస్యమైతోంది. అధికారులు పత్తి ధరను తగ్గిస్తే నష్టపోతున్నాం.

- రజాక్, రైతు, తుమ్మలపల్లి, చౌదరిగూడ మండలం

తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారు



తేమ పేరుతో అధికారులు కొర్రీలు పెడుతున్నారు. చలి కారణంగా మంచు కురుస్తోంది. దీంతో పత్తిలో తేమ పెరుగుతోంది. దానిని అధికారులు కొనడం లేదు. ఇప్పటికే తీసిన పత్తిని కేంద్రాలకు తరలిస్తే తేమ ఎక్కువగా ఉందంటూ క్వింటాలు పత్తికి మద్దతు ధరలో రూ.70 కట్ చేసుకుంటున్నారు.

- కావలి మల్లేష్, రైతు నర్సప్పగూడ, నందిగామ మండలం

జనవరి చివరి వరకు పత్తి సేకరిస్తాం



జిల్లాలో 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈ సారి ప్రైవేట్ వ్యాపారుల కంటే ప్రభుత్వం మద్దతు ధర అధికంగా చెల్లిస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు 16,928మంది రైతుల నుంచి 49800.70 టన్నుల పత్తిని సేకరించాం. కేంద్రాలకు ఇంకా పత్తి వస్తుంది. జనవరి వరకు పత్తిని సేకరిస్తాం. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేసి కేంద్రాల్లోని పత్తిని అమ్ముకోవాలి.

- మహ్మద్ రియాజ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

హరీ్‌శరావుకు మాజీ సర్పంచ్‌ల ధన్యవాదాలు


హరీ్‌శరావుతో మాజీ సర్పంచ్‌లు

కేశంపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల విషయం అసెంబ్లీలో ప్రస్తావించిన సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీ్‌శరావుకు మండల మాజీ సర్పంచ్‌లు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం తలసాని వెంకట్ రెడ్డి, కామ్లెకార్ నవీన్‌కుమార్, ఆంజనేయలు, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ హైదరాబాద్ హరీ్‌శరావును ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. బిల్లులు రాక మాజీ సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి తీసుకపోయారు. పెండింగ్ బిల్లులు ఇప్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు.

పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న పవన్‌కుమార్

షాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ వెల్‌కృషి బెటర్ కాటన్ మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం తాళ్లపల్లి, కక్కులూర్, బోడంపహాడ్, కేసారం గ్రామాల్లో పత్తి రైతులు, కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూలీల కనీస వేతనాలు, బాల కార్మికులపై అవగాహన, పత్తి నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎక్సటెన్షన్ ఆఫీసర్ ఓంనాథ్, కృషి సిబ్బంది జ్యోత్స్న, మానస, శ్వేత, అజయ్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు బెస్ట్ అవార్డు



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ వి-102-ఎ డిస్ట్రిక్ట్ గవర్నర్ సూరిశెట్టి నర్సింహులుగుప్తాకు క్లబ్ ఇంటర్నేషన్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ సెకండ్ సూపర్ బెస్ట్ అవార్డు ఇచ్చి సత్కరించారు. తమిళనాడులోని మధురైలో జరిగిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్(ఐకాన్) కాన్ఫరెన్స్‌లో నర్సింహులును అవార్డుతో సత్కరించి, క్లబ్ ఇంటర్నేషన్ మల్టిపుల్ డైరెక్టర్‌గాఎంపిక చేశారు. అలాగే షాద్‌నగర్‌కకు చెందిన దొంతు పాండు రంగయ్యను క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రసిడెంట్‌గా ఎన్నిక చేశారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

తలకొండపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందని బీజేపీ జిల్లా నాయకులు బక్కి కుమార్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. రాంపూర్‌లో మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, స్థానిక సమస్యలపై సమావేశంలో చర్చించారు.